వరద



గొలిని గాలి తెగ నరుకుతున్న హోరు... సుళ్లు తిరుగుతూ తరుముతున్నట్టు ఏట్లో నీళ్ల చప్పుడు. ఆ హోరులో, ఆ చప్పుళ్లో ఎన్నో జతల కాళ్ల, చేతుల చప్పుడు... రాళ్లు, కఱ్ఱలు, కంపలు, ఇసుక పరిగెడుతున్న మోత.

ఆ కాళ్ళలో బలం అడుగులు వేస్తోంది. ఆ చేతుల్లో బరువులు ఆరాటపడుతున్నాయి. వాళ్లందరూ నీళ్లతో దెబ్బలాడుతున్నారు, పోటీ పడుతున్నారు.

"తొందరగా రండిరా! బేగి అడుగు లెయ్యండిరా" అంటున్నాడు నారాయుడు. చేతిలో పార ఉంది. ఎప్పటికప్పుడు ఒంటిమీద మట్టిని వాన కడిగేస్తోంది.

పరుగు.... నడక.... నడకలాంటి పరుగు. ఎవరి కందినవి వాళ్లు తీసుకొస్తున్నారు. రాళ్లు..

ఆకులు.. గడ్డి...

తెస్తూ, తేవడానికి వెడుతూ, ఏటికట్ట ఎత్తు దగ్గర మఱ్ఱిచెట్టుని, మఱ్ఱిచెట్టు మొదట్లో కూచున్న తననీ అప్పుడప్పుడు చూస్తూ వెడుతున్నారు.

ఆ చూపులు ఇబ్బందిగా ఉన్నాయి తనకి. వాళ్ల నుంచి వేరు చేస్తున్నాయి అవి.... ఆ వేరు చేస్తున్నవాళ్ల దృష్టిలో గౌరవమే ఉంది. తక్కువ భావన లేదు.

ముందు వద్దన్నా వినకుండా చేతికందిన ఒకటి రెండు రాళ్లు మోశాడు. చేసే సహాయం కన్నా, వాళ్లకి అడ్డు రావటమే ఎక్కువయింది.

"అలవాటు లేని పని బాబూ! మీ కొద్దు.... మీ ఒక్క చెయ్యి సాయం లేకపోయినా పెద్ద లోటు కాదు... ఆ చెట్టు మొదట్లో కూచోండి" అన్నాడు నారాయుడు. చెయ్యి పుచ్చుకుని బలవంతంగా తీసుకు వెళ్లి కూచోబెట్టాడు.

తను కూడా వాళ్లలాగే ఏ రాయో, రప్పో మోసి నీళ్లతో దెబ్బలాడాలని ఉంది. ఆ సమయంలోనేనా వాళ్లలో కలిసిపోయి, వాళ్ళలో ఒకడుగా మారిపోవాలని ఆరాటంగా ఉంది. కాని, అలవాటు లేదు. ఓ గంటో, రెండు గంటలో పనిచేస్తే అలవాటవుతుంది కొంతవరకూ. రోజంతా పనిచేస్తే బాగా అలవాటవు తుంది. మళ్లీ మరోసారి ఎప్పుడేనా ఇలాంటి బాధ ఉండదు. 'మళ్లీ మరోసారి... ఎందుకు... ఏరు మళ్లీ ఇలా పొంగాలా? ఏటికట్టకి ఇలా గండి పడాలా...

చెట్టు మొదట్లోకి ఎంత ఒదిగి కూచున్నా కాళ్ల మీద, తల చివర నీళ్లు పడుతూనే ఉన్నాయి... ఇబ్బందిగా ఉంది. చిరాగ్గా ఉంది.

ఏటిలో హోరు ఎక్కువైంది. గాలి పైపైకి వెళ్లి పిలుచుకు వస్తున్నట్టు మబ్బులు ముసురు కుంటున్నాయి. మట్టిని తవ్వి తమలో కలుపుకున్నట్టు ఎఱ్ఱబడి పారుతున్నాయి నీళ్లు. ఏటి కా గట్టు వేపు తెల్లటి దూడ కొట్టుకుపోతోంది తాటాకుల కంపలాగ... ముఖం మీద నల్లటి మచ్చ అందంగా... 'అంబా' అన్న అరుపువల్ల చూశాడు అటు.

తాటాకులు.... ఈతకంపలు.... దూలాలు ఒకదాని తరువాత ఒకటి కొట్టుకు వస్తూనే ఉన్నాయి. ఎఱ్ఱటి నీళ్లు, పచ్చటి నురగ ముందుకి తోసేస్తూనే ఉన్నాయి వాటిని.

అందరూ నిలబడ్డారు కట్ట దగ్గిర... నారాయుడు నడుం మీద చేతులు వేసుకుని నిలబడి చూస్తున్నాడు. రమ్మన్నట్టు చెయ్యి ఊపాడు.

గండి దగ్గిర కట్ట ఎత్తునా దాపుగా పెద్ద రాళ్లు పెట్టారు. వాటి వెనకా, ముందూ ఆకులు.... కఱ్ఱలు.... చిన్నచిన్న రాళ్లు, అందరూ చూస్తున్నారు - ఏటిని.... రాళ్లని.... కట్టని.... నారాయుణ్ణి... తనని...

వాళ్లు మనుషులు నిలబడినట్టు లేరు. నీళ్లు నిలువెత్తున నిలబడినట్టున్నారు. తల నుంచి కింది వరకూ ధారగా నీళ్లు కారుతున్నాయి. కాళ్ల నిండా బురద.... కళ్లనిండా ఆరాటం...

"రండి, బాబూ, పోదాం" అన్నాడు నారాయుడు ఏటి గట్టెక్కుతూ.

"గండి నిలుస్తుందా?" అని అడగాలనిపించింది.

రెండడుగులు వేయగానే గ్రహించినట్టు నారాయుడే మాట్లాడాడు.

"గండి చిన్నదే, బాబూ!.... దాపు బలంగానే పెట్టాం. కాని, ఏటి పోటెక్కువగా ఉంది. పైన చూస్తే ముసురుకొస్తోంది ఇంకా... రెండడుగులు నీరు పెరిగితే కట్ట మీంచి పార్లిపోద్ది...."

'పార్లిపోద్ది' అంటున్నప్పుడు మాట కొద్దిగా తడబడింది నారాయుడికి.

గుడిదాకా వచ్చారు. వచ్చేటప్పుడు కూడా ఇదే దార్లో వచ్చారు. గుడి మలుపు తిరిగితే ఊరు.... అన్నీ కలిపితే రెండు వందల ఇళ్లు.... ఇంచుమించు అన్నీ పూరిళ్లే, ఏవో ఒకటి, రెండు పెంకుటిళ్లు తప్ప...

గుడి కూడా మరీ పెద్దది కాదు. గుడి గడప ఎత్తు వరకూ నీళ్లు నిలబడున్నాయి. ప్రహరీ లోపల, ఆవరణ అంతా కూడా నీళ్లు నిండున్నాయి. దేవుడు మోకాళ్ల వరకు మునిగిపోయాడు. నారాయుడు మలుపు తిరుగుతూ గుడి తలుపు ముందు ఓ క్షణం ఆగాడు. యాభై ఏళ్లకళ్ల ఆ చూపులో, మూసుకున్న కనురెప్పల బరువులో బాధ కదిలినట్టయింది. గుడి దాటి నాలుగడుగులేశారిద్దరు.

ఎలా అడగాలో అర్థం కాలేదు. ఒకటి రెండుసార్లు ప్రయత్నిస్తే మాటలు బయటికి రాకుండా నాలిక్కి చుట్టుకుపోయాయి. నారాయుడంటే భయమేం కాదు అడగలేకపోవటానికి.... అంత అడక్కూడనిదీ కాదు. కానీ, సంకోచంగా ఉంది. పరిస్థితి వల్ల.... కొంచెం ఇబ్బందిగా, చిన్నతనంగా అనిపించింది.

చినుకులు పలచబడి గాలిలో ఎగురుతున్నాయి... ఇందాకటికన్నా కొద్దిగా వెలుగ్గా ఉంది.

టైము చూసుకుంటే ఒంటి గంటన్నర అయింది. కళ్యాణి గుర్తు వచ్చింది. పొద్దుటి నించి తనేం తినలేదన్నది గుర్తు వచ్చింది. వెంటనే తిరిగి వస్తానని తనని వదిలేసి వచ్చి నాలుగు గంటలయింది. చివరికి అడిగేశాడు... సన్నగా బయటికి వచ్చాయి ఆ మాటలు.

"బియ్యం కావాలి, నారాయణా"

నారాయుడు వేస్తున్న అడుగు వేగం కొంచెం తగ్గింది. తన ముఖంలోకి చూశాడు.... నారాయుడి చూపులు చూడాలనిపించలేదు.

వీధులసలే అంతంతమాత్రం. మోకాళ్ల లోతు నీళ్లున్నాయి. అన్ని ఇళ్లలోకి చొరబడ్డాయి. ఎత్తుగా ఉన్న గోడ అంచుల చివర చేరి కప్పలు బెకబెకలాడుతున్నాయి.

"ఏం బాబూ, ఇంట్లో..."

"అయిపోయాయి" అన్నాడు మాట పూర్తి కాకుండానే.

ఇంకో నాలుగడుగులు వేశారు. నారాయుడి పాక దగ్గరికి వచ్చారు. పొద్దున్న నారాయుడు సరిగ్గా అక్కడే పలకరించాడు. ఆ ఊళ్లో ముందుగా దణ్ణం పెట్టినవాడు, పలకరించినవాడు నారాయుడే. తను తప్ప ఇంకెవరూ తెలియదు. ఊళ్లో మిగిలిన అందరికీ తను తెలిశాడు. కాని, తనింతవరకు ఊళ్లో వాళ్లెవరితోనూ మాట్లాడలేదు. ఊళ్లోకి వచ్చి అయిదు రోజులైనా బయటికి వచ్చింది ఈ రోజే.

నరసింహం పాలేరవటం వల్ల, ముందుగా నరసింహం చెప్పి ఉండటం వల్ల తనంతగా తనే పలకరించాడు నారాయుడు పొద్దున్న.

"అందరిళ్లలోనూ నీళ్లు చేరాయి, బాబూ. ఇంక రంగయ్య ఒక్కడి దగ్గిరే దొరుకుతాయి. ఉత్తప్పుడే ఆడి ఆశకి అంతుండదు. ఇప్పుడు మరీ మింగుతాడు" అన్నాడు నారాయుడు.

'దొరుకుతాయి' అనగానే ధైర్యం వచ్చింది. పరిస్థితి ఎలాంటిదైనా పెళ్లయిన కొత్త రోజుల్లోనే కళ్యాణిని పస్తులుంచవలసి వస్తుందేమో అన్న బాధ తీసేసినట్టయింది. జేబులోంచి గబుక్కున పది రూపాయల కాయితం తీశాడు. తీసిం తరువాత తటపటాయింపు చూసి, నారాయుడే చొరవగా అందుకున్నాడు. "మా చిన్నాణ్ణి పంపించి తెప్పిస్తాను. రండి, బాబూ!" అన్నాడు లోపలికి నడుస్తూ.

లోపలన్నీ నీళ్లే. పాక గోడ కానుకుని నిలబడ్డాడు. నీళ్లున్న ఎత్తుకన్నా పై వరకూ చెమ్మవల్ల తడిగా ఉన్నాయి గోడలు. ఊరికే ఇబ్బంది పడ్డాడు నారాయుడు, కూచోపెట్టలేకపోయినందుకు.

కుర్రాడు తిరిగి వచ్చేవరకు ఆ సంగతులు, ఈ సంగతులు మాట్లాడుతోంటే, నరసింహం, రంగయ్యే ఊళ్లో పెద్ద కామందులని, ఊరు చుట్టుపక్కల పొలాలు చాలావరకు వాళ్లవేనని చెప్పాడు నారాయుడు.

కుర్రాడిచ్చిన సంచీ అందుకున్నాడు. ఇంటివరకూ వస్తానన్న నారాయుణ్ణి అక్కర్లేదని ముందుకు నడిచాడు. సంచీ తేలిగ్గా ఉంది. రెండు సేర్లకన్నా ఎక్కువ బియ్యం ఉండవనిపించింది. నారాయుడు కూడా అన్నాడు చూసి. ఆ మాత్రం దొరికిందే ఎంతో సంతోషమనిపించింది. వీధిలో నీళ్లలోంచి నడుస్తుంటే ఏరు కళ్లముందు కదిలింది.

అయిదారేళ్ల క్రితం వేసవికాలంలో, నరసింహంతో పాటు వచ్చి చూశాడు ఇదే ఏటిని. పచ్చటి ఇసక మీద పల్చటి తెరలా పారుతున్నాయి నీళ్లప్పుడు. నీళ్లలో సన్నటి చీలికలు, తెరలు, అటువేపు గట్టు మీద పచ్చగా చెట్లు. అస్తమానం కాలికి తగిలే చిన్నచిన్న చేపలు. ఆనాడు చూసిన ఆ అందం కోసమే కళ్యాణిని ఇక్కడికి తీసుకువచ్చాడు. ఇప్పుడా ఏరు కొట్టుకుపోతున్న దూడతో కళ్లముందు కదిలింది. అడుగులు తొందరగా వేశాడు.

నరసింహం ఇల్లు చిన్న గుట్టలాంటి దానిమీద ఊరుకన్నా బాగా ఎత్తులో ఉంది. పెద్ద ఇల్లు. విశాలంగా ముందు ఆవరణ, తోట. నరసింహం ఎక్కువగా ఈ ఊళ్లో ఉండకపోయినా చాలా అందంగా ఉంచాడు ఇంటినీ, పరిసరాల్నీ. 'కళ్యాణి ఎలా ఉందో' అనిపించింది గుట్ట ఎక్కుతుంటే.

★ ★ ★

కిటికీ బయట...

గాలికి చీలుతున్న లైటు వెలుగులో తెల్లటి సూదుల్లా వర్షం. ఆ సూదులు నీళ్లని చీలుస్తున్న గలగల మోత.

లైటు వెలుగు పడని చోట చీకటి మోగుతోంది వర్షంలా. మబ్బుల కౌగిట్లో మెరిసిన మెరుపు కాంతిలో పాముల్లా చెట్టకుదుళ్లల్లోకి పాకుతున్నాయి నీళ్లు.

'పై నుంచి ధారగా పడుతున్న సూదులు పాములవుతాయి. పాములన్నీ ఒకదానితో ఒకటి కలిసి, కొండల మీంచి దొర్లి, దూళ్లని, దూలాల్ని, కంపల్ని తోసుకుంటూ ఏట్లోకి.... ఇంక రెండడుగుల నీరు పెరిగితే?' నారాయుడి కళ్లు కళ్లముందు కదిలాయి.

'ఎందుకీ వర్షం... ఎవరి కోసం?'

నిన్న రాత్రి సరిగ్గా ఇలాగే కిటికీ బయట చీలుతున్న వెలుగులో వర్షాన్ని చూస్తుండగా.... తన వీపుమీద కళ్యాణి పల్చటి ఆకుమీద నీటిబిందువులా కిందికి జారుతుంటే, వెన్నులోంచి పైకి పాకిన వేడి గుండెల దగ్గర ఆగిపోయినప్పుడు....?

జీవితంలో కోరుకున్న నిండు దొరికినట్టనిపించింది. గడుస్తున్న ప్రతి క్షణం ముందు ముందు గడపబోయే సంసార జీవితానికి బలమైన పునాది వేస్తున్నట్టనిపించింది.

ఆ నగర జీవితంలోని ఇరుకుకి, నా అన్న ఫాక్టరీ గొడవలకి, మనసుని చెదలా తినే డబ్బు

మోజుకి దూరంగా కనీసం కొన్ని రోజులేనా కళ్యాణితో గడపాలని మారుమూల ఈ పల్లెకి వచ్చినందుకు ఆనందం నిండుగా దొరుకుతున్నట్టనిపించింది.

ఆ వర్షం, కిటికీలోంచి గాలి విసిరిన జల్లు వరంలా తోచాయి. కళ్యాణి స్పర్శ.... జీవితంలోని బాధలకి, వ్యామోహాలకి, అగచాట్లకి, అవమానాలకి, కన్నీళ్లకి కవచంలా స్త్రీ పురుషులకి సృష్టి ప్రసాదించిన వరమేమో అనిపించింది. ప్రకృతి నవ్వుతున్నట్టున్న ఆ వర్షం తన కోసమే అన్న తృప్తి.

'అలాగే ఈ రోజు కూడా తృప్తిపడేవాళ్లు ఉండకూడదా? నిన్న జీవిత అవసరం లేదు, అనుభవం తప్ప..... రేపన్న ధ్యాస లేదు. కాని ఇప్పుడు.... రేపు...'

తనని తాకుతున్న ఆ వేళ్లెవరివో తెలుసు... కళ్యాణి.

"ఎందుకు ఊరికే అలా... అంతగా ఇక్కడ వర్షాలు చిరాగ్గా ఉంటే మనింటికి వెళ్లిపోదాం..." అంటోంది చెవి దగ్గిర నెమ్మదిగా, అమాయికంగా...

"అవును, వెళ్లిపోదాం.... రేపు..." కాని కాళ్లు బయట పెడితే నీళ్లు.... నీళ్లు.... రేపు మధ్యాహ్నం వరకూ బియ్యం ఉన్నాయి. బయటికి వెళ్లక్కర్లేదు.

★ ★ ★

ఇంకా తెల్లవారని మసకచీకట్లో...

చీకటిలా ఉన్నాడు నారాయుడు. గడ్డం అన్చటం వల్ల చేతిలో కర్ర నేలమీద మట్టిలో కొద్దిగా కూరుకుపోయింది.

"మరయితే రాత్రంతా...." అన్నాడు తను.

"సగం రాత్రి నించి చిన్నా, పెద్దా అంతా గోడల మీద, పాక కప్పుల మీద గడిపాం, బాబూ.."

'చీకట్లో కురిసే వర్షంలో ఆడా మగా చిన్నా పెద్దా గోడల మీద.... ఇళ్ల కప్పుల మీద....' ఊహ కళ్లముందు దృశ్యంగా ప్రయత్నించినా కనపడలేదు. చీకటిలా అలుక్కుపోయింది.

"అసలే పల్లపూరు ఇది... నిన్న దాపెట్టిన గండి కొట్టుకుపోయినట్టుంది. ఇంక ఊళ్ళో ఎత్తునున్న ఇళ్లు రెండే.... ఈ ఇల్లు... రంగయ్యది" అన్నాడు కర్రమీది నించి తల ఎత్తి చూసి నారాయుడు.

"ఏమంటార"న్నట్టు ఉన్నాయి ఆ చూపులు. ఏమనటానికి ఏముందో అర్థం కాలేదు తనకి తిరిగి నారాయుడు అనేవరకు.

"కొత్తగా పెళ్లి చేసుకుని, నాలుగు రోజులు ఒంటరిగా గడుపుదామని వచ్చినారు మీరు. మీ దగ్గిరికి మేమంతా...." మాట పూర్తి కాకుండానే అర్థమయింది.... దీనికోసమా తటపటాయింపు అనిపించింది. 'పద. తొందరగా అందర్నీ తీసుకొద్దా'మని నారాయుడి చెయ్యి పుచ్చుకుని లాక్కుపోవాలనిపించింది.

ఇద్దరూ గుట్ట దిగి కింద మలుపు దగ్గిరికి వచ్చేటప్పటికి కళ్లముందు నీళ్లు మెదిలాయి. నాలుగడుగులు వేసేటప్పటికి పిక్కలదాకా వచ్చాయి. చల్లగా కరుస్తున్నాయి, అలాగే నడుస్తుంటే...

"ఇళ్లు రెండూ ఎత్తే అయినా, మేమందరం ఈ ఇంటికొస్తేనే గట్టెక్కినట్టు" అన్నాడు నారాయుడు.

నారాయుడు ఎందుకలా అంటున్నాడో ముందు అర్థం కాలేదు.

"ఏముంది బాబూ.... నిన్న పొద్దున్న కూడా ఏ పాకలోనూ పొగ లేవలేదు. మొన్నెప్పుడో తిన్న

తిళ్లు. డబ్బూ అంతంతమాత్రమే. మీ ఇల్లయితే వేరు.... ఒక్క వర్షం దెబ్బే తట్టుకోవటం.... అదే రంగయ్య ఇల్లయితే ముందు బతుక్కే దెబ్బ.... ఆ ఇంట్లో బస్తాలతో గింజలెప్పుడూ ఉంటాయి. ఎదురుగా చూస్తూ ఆకలి ఊరుకోనియ్యదు. నిన్ననే అంతుంది ఆడి ఆశ. ఈరోజు ఈ నీళ్లలాగే ఇంకా పెరిగుంటది. అందరి దగ్గిరా ఉన్న డబ్బు ఒడుక్కోటంతో పోనివ్వడు.... ఆడాళ్ల కాళ్ల మట్టెల దగ్గిర నుంచి, చెవి కమ్మలవరకు - వస్తువులే కాదు, ఆళ్ల కమతంలోకి మనుషుల్నే వ్యాపారంలో సంపాదించాలని చూస్తాడు. అందుకు మీ ఇల్లే ఇప్పుడు గుడి మాకు. ఆకలితో రెండు రోజులు నకనకలాడినా, నీళ్లు తగ్గింతరువాత బతుకులు మామూలుగా ఉంటాయి...." అన్నాడు.

ఎలాంటి జీవితం? డబ్బు చుట్టూ గిరి గీసుకుపోయిన బతుకు. ముందుచూపు రూపంలో ఆకల్ని కూడా జయిస్తుందా?...

కనుచూపు వరకూ నీళ్లు. పాకలముందు కంచెల్ని దాటి, తలుపుల్ని, గోడల్ని మూడు వంతులు మింగేసి గుటకపడకుండా నిలిచిపోయిన నీళ్లు. చెయ్యెత్తు మనిషయితే గుండెలదాకా వస్తాయి. మామూలు మనిషయితే పీకలదాకా తడవక తప్పదు. నడుంవరకు నీళ్లు రావటం చూసి...

"మీరు వెనక్కి వెళ్లి ఇంటి దగ్గిరుండండి. నేను వాళ్లని తీసుకువస్తా" అన్నాడు.... 'ఫరవాలే' దన్నా బలవంతంగా వెనక్కి పంపేశాడు.

వెనక్కి తిరిగివస్తే ఇంటికి వెళ్లాలనపించలేదు. గుట్ట సగంవరకూ ఎక్కి కూచున్నాడు. వర్షం లేకపోయినా మబ్బులు మామూలుగానే ఉన్నాయి.

★ ★ ★

వస్తున్నారు వాళ్లు, గుంపుగా నీళ్లని ఒత్తిగించుకుంటూ. చేతుల్లో చిన్నచిన్న మూటలతోటి, గిన్నెలతోటి, నెత్తిమీద పిల్లలతోటి... నీళ్లని చిత్రంగా చూస్తున్న పిల్లలు, ముసలాళ్ల చేతులు పట్టుకు నడిపిస్తున్న పడుచువాళ్లు... పడుచువాళ్ల నెత్తిమీద పిల్లలు. వాళ్లు.... వాళ్లందరి చుట్టూ నీళ్లు. గుంపు ఒక్కొక్క అడుగే కదుపుతుంటే నీళ్ల అంచులు కదులుతున్నాయి. నీరసంగా ఉన్నవాళ్లు నడవటం లేదు. నీళ్లు తోస్తున్నాయి వాళ్ళని ముందుకు. గుట్టదాకా వచ్చిన తరువాత 'అమ్మయ్య' అన్నట్టు ఆగింది గుంపు.

నెమ్మదిగా గుట్టమీదికి బయలుదేరారు వాళ్లు. కొందరు సగం ఎక్కారు. ఇంకొందరు మూడువంతులు ఎక్కారు. రాత్రంతా నిద్రలేని మనుషులు, ఓ రోజంతా తిండి లేనివాళ్లు జోగిపోతూ కూలబడ్డారు.

తను తిరిగాడు వాళ్లందరి చుట్టూ, ఒకళ్ల దగ్గిర నుంచి ఒకళ్ల దగ్గిరికి, బురదకాళ్లని దాటుకుంటూ, పసిపిల్లల ఏడుపుల మధ్య, వాళ్లందరి నీరసం చుట్టూ.

తిరిగాడు ఇంట్లోంచి బయటికి, బయటి నుంచి ఇంట్లోకి. పొద్దు పైపైకి పోయినా ఎండ పొడలేదు. అలాగే జోగుతున్నారందరూ, ఆ గుట్టని పట్టుకు వేళ్లాడుతున్నట్టు.

బాధనిపించింది తనకి, ఎందుకో, ఏమిటో నిర్ధారణగా తెలియని బాధ. ఎవరూ ఏం చేయటానికి తోచకుండా కూచున్న బాధ. తను వాళ్లచుట్టూ తిరుగుతున్నప్పుడు వాళ్లు చేయెత్తి దణ్ణం పెట్టిన చూపుల బాధ.

రాత్రి వాళ్లలో వాడే నరసయ్య పాక కూలిపోయిందని, ఈమధ్యనే నీళ్లోసుకున్న వాడి భార్య జాడేలేదని, కూలిపోయిన పాకకింద నీళ్లలో కూరుకుపోయారేమోనని.... కళ్లనీళ్లతో ఇందాకా నారాయుడు చెప్పిన మాటలు గుర్తుకి వచ్చిన బాధ.

చిన్నా పెద్దా, ఆడా, మగా - అందరి ముఖాల్లోను ఆకలి. సహజంగా మనిషికి బలాన్నిచ్చి, మనిషిగా నిలబెట్టే ఆకలి. అదే ఆకలి ఇప్పుడందర్నీ తింటోంది.

నిన్న మిగిలిన బియ్యంతో వంటచేసిన కళ్యాణికి తననెలా పిలవాలో తెలియలేదు. వంటింట్లో కాకపోయినా చాలామంది సావిట్లో కూడా ఉన్నారు.

ఎలాగో పిలిచింది. వంటింట్లో మూలకి తీసుకు వెళ్లింది. కళ్యాణి కంచాలు తీస్తుంటే, కళ్లముందు వాళ్లందరి ఆకలి కదిలింది. తనకి..... తను తినకపోతే కళ్యాణి కూడా మానేస్తుందేమో! తన తోడు పంచుకుని పట్టుమని పదిరోజులేనా కాకుండా పస్తులుంటుందేమోనని కూచున్నాడు.

అన్నం చేతికి చల్లగా తగిలింది. కరిచినట్టనిపించింది. పొద్దున్న నీళ్లలా.... కడుపులో ఆకలితో పాటు, వాళ్లందరూ అన్న దృష్టి కలగలిసి తిరిగింది. రెండు ముద్దలకన్నా ఎక్కువ దిగలేదు. కళ్యాణీ తినలేకపోయింది.

బయట వసారాలోకి, వాళ్లందరి మధ్యకి వస్తే ఏదో తప్పు చేసినట్టనిపించింది, చేసింది అన్నం తినటమే అయినా అసహజమైనదేదో చేసినట్టు.

"అమ్మా, ఇక్కడ నేలమీద నీళ్లు లేవుగా. బువ్వొండవా" అంటున్న పిల్లకి, చెంగుకి కట్టుకున్న మూట విప్పి పెడుతోంది పిల్ల తల్లి, నీళ్లలో తడిసి ముక్కిపోయిన బియ్యంగింజలు.

కొందరు తడిసిన సెనగలు, ఇంకొందరు మొక్కిపోయిన నూకలు.... అలా.... ఆకలి చుట్టూ వాళ్ళందరూ.... వాళ్లందరి చుట్టూ ఆకలి.

★ ★ ★

తెల్లారుతుందా అనుకున్న రాత్రి తెల్లారింది.

"కుర్రాళ్లు కంగారుపడేలా ఉన్నారు, బాబూ.... రంగయ్య ఇంటిమీదికి వెళ్దాం అంటున్నారు. మీరేమనుకోకుండా ఒక్కసారి రంగయ్య ఇంటికి వెళ్లిరండి" అన్నాడు నారాయుడు తల వంచుకుని, అలా చెప్పవలసి వచ్చినందుకు బాధపడుతున్నట్టు.

ఇద్దరు మనుషుల సాయంతో బయలుదేరాడు రంగయ్య ఇంటికి తను. నీళ్లు తగ్గుముఖం పట్టినట్టేం లేవు. నారాయుడు చెప్పినదాన్నిబట్టి ఊహించినదానికంటే అసహ్యంగా కనిపించాడు రంగయ్య ఆకారంలోనూ, బుద్ధుల్లోనూ కూడా. ముతక పంచ, గుడ్డ బనీను, సోమరిగా పెరిగిన పొట్ట, నోట్లో పెద్ద చుట్ట.... అస్తమానం అసహ్యంగా ఉమ్ములు. నంగినంగిగా మాట్లాడాడు. మామూలు రోజుల్లో వంద ఖరీదు చెయ్యని బియ్యానికి మూడు వందలిస్తానని తన తరపునా, ఊళ్లో రంగయ్యతో సమాన ఫాయిదాలో ఉన్న నరసింహం తరపునా హామీ ఇస్తానన్నా వినలేదు.

ఇది సమయం అన్నాడు. తెలివైన వ్యాపారానికి ఇంతకంటే మంచి అదనుండదన్నాడు. తనకి కావాలంటే ఓ పదిశేర్ల బియ్యం తీసుకువెళ్లమన్నాడు, పెళ్లాంతో సుఖంగా నాలుగు రోజులు గడపటానికి, వాళ్లందరి గొడవా వాళ్లకే వదిలివెయ్యమని నీతులు చెప్పాడు రంగయ్య.

జరిగింది విన్న తరువాత నారాయుడు, మిగిలిన వాళ్ళు "ఏం చేయమంటా"రని తనని అడిగితే "ఏం చేయమనాలి. వాళ్ళు చేద్దామనుకునేదేమిటి? రంగయ్యని.... రంగయ్యని దోస్తామంటారు. ఏమనాలి తను? రేపు తన ఫాక్టరీలో వాళ్ళు కూడా తనని ఇలా దోస్తామంటే ఏమంటాడు తను?...'

ఊహించినట్టుగానే అయింది. వాళ్లందరి చూపులు అడిగా. నారాయుడు నోరు తెరిచే అడిగాడు, 'బాబూ! ఏం చేయమంటారు? మా కుర్రాళ్లు ఊరుకునేలా' లేరని. వాళ్ల అలిసిన కళ్లల్లోంచి, నిన్న మొన్నా తడిసిన శరీరాల్లోంచి ఆకలి చేతికర్రల్లోకి చేరినట్టు కదిలాయి కర్రలు.

తనలో ఓ నిశ్చయం ఏర్పడింది. దోచేది రంగయ్యని కాదు. ఆ మనిషిని కాదు. అతని అత్యాశని, అవకాశంతో ముడి వేసుకున్న అమానుషత్వాన్ని. తప్పు లేదనిపించింది. కర్రలతో కదిలిన వాళ్ల వెనకే తనూ నడిచాడు.

దిగుడుగా ఉన్న గుట్టరాళ్లమీద గబగబ పడుతున్నాయి వాళ్ల అడుగులు. వాళ్లకి నారాయుడో పక్క, తనో పక్క.

కదలకుండా నిలబడ్డ నీళ్ల మీద కదులుతున్న వరదలా ఉన్నారు వాళ్లు.

రంగయ్యకి ముందుగానే వార్త తెలిసినట్టుంది. తన పెద్ద పాలేరు ఎల్లయ్యతోపాటు మరో ముప్ఫైమందికి కర్రలిచ్చి నిలబెట్టాడు.

'కర్రలు కలవాలా? తలలు బద్దలయి నెత్తురు చిమ్మాల్సిందేనా? వరదలా, ఉప్పెనలా ఉన్న వీళ్ల ముందు ఆ ముప్ఫైమంది ఎంతసేపు నిలవగలరు?' కాని రంగయ్య దృష్టికి అక్కర్లేదీ విషయం. తన వ్యాపారం, తన డబ్బూ.... ఇవే.

గుంపునంతటినీ ఆగమన్నాడు నారాయుడు. ఒక్కడే కదిలి ముందుకి వెళ్లాడు ఎల్లయ్య దగ్గిరికి. ఎదురుగా నిలబడ్డాడు. ఒకళ్లనొకళ్లు చూసుకున్నారు ఓ క్షణం.... నారాయుడనేది వినిపిస్తోంది.

"ఒకూరోళ్లం. ఈ నీటి ముంపు, ఈ సమయం నీకు తెలుసు. ఈ సమయంలో నువ్వు ఈళ్లందర్నీ నాలా ఎంటేసుకు మా కామందు దగ్గరకొచ్చినా, నేను నీలా అడ్డు నిలిచేవాణ్ణి కాదు. మూడు పూటల్నించి ఎవరూ గంజికూడా తాగలేదు. మాక్కావలసింది రెండు మూటల బియ్యం, ఆయనతో సెప్పు" అన్నాడు.

ఓ క్షణం ఆలోచన తరువాత కర్రని కొంచెం ఎత్తాడు ఎల్లయ్య. ముందు చూశాడు. నారాయుడి భుజాలమీంచి మండుతున్న వరదలా ఉన్నారు వాళ్లు. వెనక ఇంట్లో స్తంభంచాటున నిలబడున్నాడు రంగయ్య. లౌక్యం, నలభై ఏళ్ల జీవిత అనుభవం నిర్ణయం చేసింది ఎల్లయ్య మనసులో. రంగయ్య ఇచ్చే యాభైకో, వందకో కక్కుర్తిపడి వీళ్ళ కెదురు నిలవటం అంత మంచిది కాదనిపించింది. దానికన్నా ఈ నీటిముంపు తగ్గిన తరువాత ఊళ్లో అందరూ తమని వెలేసిన కుక్కల్లా చూస్తారనిపించింది. అలాగేకదిపిన కర్రని పక్కకి విసిరేశాడు ఎల్లయ్య. వెనక నుంచి రంగయ్య అరుస్తూనే ఉన్నాడు, 'నీకింతిస్తా... అంతిస్తా... దెబ్బలాడ'మని.

వరద ముందుకు కదిలింది రంగయ్య ఇంటిలోకి. వాళ్ల ఆకలి నవ్వింది. వాళ్ల నీరసం గంతు లేసింది. రెండు బియ్యం మూటల్ని అవలీలగా ఎత్తుకో గలిగింది ఆ ఉత్సాహం...

★ ★ ★

ఆ గుట్టమీద ఇంటి ముందు వాకిట్లో, వరసగా కూచున్న అందరికీ కళ్యాణి అన్నం వడ్డిస్తూంటే, ఆవురావురని ఎదురు చూస్తున్న చిన్నపిల్ల కంచంలో వడ్డిస్తున్న అన్నంతోపాటు రెండు కన్నీటి చుక్కలు కూడా రాలాయి.

తెల్లటి ఆ అన్నం దోపిడీదే అనిపించినా, వ్యామోహం, లోభం చేసింది కాకుండా, జీవితం, అవసరం, ఆకలి చేసిందనిపించింది. న్యాయం తనంత తనుగా చేసిన దోపిడీ అనిపించింది తనకి.

ఆ సమయంలో వరద, ఆకలి వరద తగ్గుముఖం పట్టినట్టనిపించింది.

• *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-2-1970*

• *మయూరి మే, 1971 (కన్నడం)*